సాక్షి చిత్తూరు

మంగళవారం ၊ 12 ၊ నవంబర్ ၊ 2024



**దుకాణాలపై అధికారుల కొరడా**

చిత్తూరులోని పలు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు మెరుపు దాడులు చేశారు. - 8లో



**రికార్డులను పక్కాగా నిర్వహించండి**

పంచాయతీ నిధులను పారదర్శకంగా వినియోగించి రికార్డులను పక్కా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. - 8లో



**పీజీఆర్ఎస్‌పై విచారణ చేపట్టండి**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. - 8లో

## న్యూస్‌రీల్

### మరోమారు చంద్రబాబు మోసం



మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : సీఎం చంద్రబాబు మహిళలను మరోసారి మోసం చేశారని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. తొలి బడ్జెట్ కేటాయింపుపై సోమవారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. అందులో 19–59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఇస్తాం అని వాగ్దానం చేసి బడ్జెట్‌లో ఆ పథకానికి నిధులు ఇవ్వకపోవడం మోసం కాదా ? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలవగానే ప్రతి నిరుద్యోగ యువతి, యువకులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం అని ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దగా కాదా ? అన్నారు. ఎన్నికల్లో గెలవగానే మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తామని, ఇప్పుడు ఆ పథకం ఊసే ఎత్తకపోవడం, నిధులు కేటాయించకపోవడం మోసం కాదా అన్నారు. తల్లికి వందనం పథకానికి నిధులు సగానికి పైగా కోత పెట్టడం అన్యాయం కాదా అన్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం అని ఈ ఏడాది 2 సిలిండర్లను ఎగనామం పెట్టడం మోసం కాదా అన్నారు. 50 ఏళ్లకే మహిళలకు పెన్షన్ ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదన్నారు. రైతులకు రూ.20 వేలు ఏడాది పెట్టుబడి సహాయం కింద ఇస్తామని చెప్పిన పథకానికి రూ.10 వేల కోట్లు ఇవ్వాల్సింది. కానీ రూ.4,500 కోట్లే ఇవ్వడం మోసం కాదా ? అన్నారు. ఎన్నికల్లో ఓట్లేయించుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంటింటికి ఇచ్చిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ బాండ్లను ఇప్పుడు ఏం చేసుకోవాలన్నారు. ఇప్పుడు ప్రజలు వీరిపై చీటింగ్ కేసులు పెట్టాలా ? అని ప్రశ్నించారు. దీనికి ఎవరు సమాధానం చెబుతారన్నారు.

### 15న అన్నాభిషేకం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఈనెల 15వ తేదీన ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సుప్రభాతం, మొదటికాల అభిషేకం, సహస్రనామార్చన, పాలాభిషేకం, సేవాటికెట్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రద్దు చేశామన్నారు. ఉదయం మహా హారతి, సాయంత్రం ప్రమాణాలు, పాలాభిషేకం, మహా హారతులు యథావిధిగా జరుగుతుందన్నారు. భక్తులు అల్పిశి పౌర్ణమి సందర్భంగా జరిగే అన్నాభిషేకాన్ని తిలకించాలని ఆయన కోరారు.




# కూటమి సర్కారు.. మోసపూరిత బడ్జెట్

కూటమి సర్కారు.. కోతల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. బడ్జెట్ ప్రసంగంలో కూడా ఆత్మస్తుతి.. పరనిందకే ప్రాధాన్యత ఇచ్చారు. సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఇటు వార్షిక.. అటు వ్యవసాయ బడ్జెట్‌లో అన్నీ కోతలే తప్ప ప్రజలకు ఎలాంటి మేలు కలిగేలా కనిపించలేదు. కూటమి నేతలు గత ఎన్నికల్లో గెలిచేందుకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఏ పథకానికి కూడా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడం గమనార్హం. రైతులకు, మహిళలకు మొండి చేయిచూపే ప్రయత్నమే చేశారు. హామీలను నెరవేర్చలేక భారీగా కోత పెట్టే యత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ మోసపూరిత బడ్జెట్ వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదని ప్రజలు, ప్రజా సంఘాల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.

- జిల్లాపై మరోమారు సీఎం చంద్రబాబు చిన్నచూపు
- బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి
- సూపర్‌సిక్స్ హామీల్లో ఏ పథకానికీ పూర్తిస్థాయిలో నిధులు కేటాయించని కూటమి ప్రభుత్వం
- రైతులకు 'అన్నదాత సుఖీభవ' పెట్టుబడి సాయం లేనట్లే..!
- కేంద్రం ఇచ్చే రూ.6 వేలు ఇస్తామని ప్రకటన
- ఊసేలేని యువతకు నిరుద్యోగ భృతి
- తల్లులకు సైతం హ్యాండ్ ఇస్తున్న సర్కారు
- బడ్జెట్ ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనిందతోనే సరి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరుకు బడ్జెట్‌లో మొండి చేయి చూపి ఈ ప్రాంత ప్రజలపై మరోమారు చిన్నచూపు చూశారు. చిత్తూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 32 మండలాలు ఉన్నాయి. 6.86 చ.కి.మీ విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న చిత్తూరు జిల్లాలో 18.73 లక్షల జనాభా నివసిస్తున్నారు. పురుషులు రూ.9.4 లక్షలు, మహిళలు రూ.9.33 లక్షల మంది ఉన్నారు. గ్రామీణ జనాభా రూ.15.04 లక్షలు ఉండగా, అర్బన్ జనాభా రూ.3.69 లక్షల మంది నివస్తున్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా రూ.4.56 లక్షల కుటుంబాలు ఉన్నాయి. రూరల్‌లో 3.66లక్షలు, అర్బన్‌లో 0.9 వేల కుటుంబాలు ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆశించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎలాంటి న్యాయం జరగలేదు.

### రైతులకు షాక్..

జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లో 180,003 హెక్టార్లు పంటల సాగు విస్తీర్ణం ఉంది. జిల్లాలోని చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో సన్నకారు రైతులు 95,102 మంది, చిన్నకారు రైతులు 28,878 మంది, కుప్పం డివిజన్‌లో సన్నకారు రైతులు 46,509 మంది, చిన్నకారు రైతులు 10,380 మంది, నగరి డివిజన్‌లో సన్నకారు రైతులు 31,132 మంది, చిన్నకారు రైతులు 6632, పలమనేరు డివిజన్‌లో సన్నకారు రైతులు 86,277 మంది, చిన్నకారు రైతులు 29,093 మంది ఉన్నారు. మొత్తం జిల్లావ్యాప్తంగా సన్నకారు రైతులు 2,59,020 మంది, చిన్నకారు రైతులు 74,983 మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. సన్నకారు రైతులు 108,187.88 హెక్టార్లల్లో, చిన్నకారు రైతులు 104,832.2 హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు పండించుకుని జీవనం సాగిస్తున్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులకు మేలు చేయాల్సిన కూటమి సర్కారు అన్యాయం చేస్తోంది. రైతుల పెట్టుబడి సహాయం హామీపై చంద్రబాబు పల్టీలు కొట్టించారు. పెట్టుబడి సాయంలో రాష్ట్రం తరఫున ఎలాంటి సహాయం చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు ఇస్తామని మెలిక పెట్టారు. అదేవిధంగా రాయితీ విత్తనాలు, భూసారపరీక్షలు, విత్తనాల పంపిణీ, ఎరువుల సరఫరాకు నామ మాత్రంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

### మహిళలకు అన్యాయం..

బడ్జెట్‌లో మహిళలకు మేలు కలిగేలా ఏవీ లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా అనేక పథకాల సొమ్మును మహిళల ఖాతాల్లోనే జమ చేసింది. కానీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో మహిళలకు మహాశక్తి పథకం ద్వారా 19–59 సంవత్సరాల వయసు గల మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రస్తుత బడ్జెట్‌లో మహిళలకు న్యాయం జరిగేలా మహాశక్తి పథకానికి బడ్జెట్ మంజూరు చేస్తారని భావించారు. అయితే ఎలాంటి బడ్జెట్ విడుదల చేయకపోవడంతో జిల్లావ్యాప్తంగా 9.33 లక్షల మంది మహిళలు కూటమి సర్కారు తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అరకొరగా తల్లికి వందనంకు నిధులు

పేద, మధ్యతరగతి ప్రజలు తమ పిల్లలను ఎలాంటి కష్టం లేకుండా చదివించుకునేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో ఆ పథకాన్ని విమర్శించిన కూటమి నాయకులు ఎన్నికలప్పుడు అదే పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనంగా పేరు మార్చి ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రతిష్టాత్మకమైన ఈ పథకంలో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ప్రచారంలో ఊదరగొట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,32,950 లక్షల మంది విద్యార్థుల తల్లులకు పథకం అమలు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించారు.

### ఊసేలేని నిరుద్యోగ భృతి..

నిరుద్యోగులకు ప్రస్తుత బడ్జెట్‌లో షాక్ తగిలింది. కూటమి సర్కారు ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న సూపర్ 6 హామీల్లో నిరుద్యోగ భృతి ఒక హామీ. ఈ హామీకి కూడా చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. జిల్లావ్యాప్తంగా ప్రతి నిరుద్యోగికి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తామని ఎన్నికలప్పుడు ఊదరగొట్టారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదు. బడ్జెలో కూడా మొండి చేయి చూపడంతో జిల్లాలో ఉన్న 4 లక్షల మంది వరకు నిరుద్యోగులు కూటమి సర్కారు తీరుపై మండిపడుతున్నారు.

### ఎన్నో ఆశలు పెట్టుకున్నాం..



ప్రస్తుత బడ్జెట్‌లో మహిళలకు మేలు జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. తీరా చూస్తే ఎలాంటి న్యాయం చేకూరే అంశాలు కూటమి సర్కారు బడ్జెట్‌లో లేవు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలపై ప్రస్తావించకపోవడం అన్యాయం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరలో ప్రారంభిస్తామని చెబుతూనే ఉన్నారు తప్పా అమలుకు నోచుకోవడం లేదు. మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని చెప్పారు అయితే ఇంతవరకు ఆ ప్రస్తావనే చేయకపోవడం ఎంతవరకు సబబు?

– లక్ష్మి, సింహారాజపురం, పాలసముద్రం మండలం

### నిరుద్యోగులను మోసం చేశారు



ఈ బడ్జెట్ నిరుద్యోగులను మోసం చేసింది. ఈ బడ్జెట్ ప్రజలకు, నిరుద్యోగులకు, ఇతర వర్గాలకు ఉపయోగకరంగా లేదు. నిరుద్యోగ భృతి ఇస్తామన్న అంశాన్ని ఎందుకు ప్రస్తావించ లేదు! ఆ భృతి కోసం ఎదురు చూస్తున్న లక్షల మందికి కూటమి సర్కారు సమాధానం చెప్పాలి.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### సంక్షేమాన్ని విస్మరించారు..



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తుందో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేదు. పాలకులు ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ప్రస్తుత బడ్జెట్ ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసింది. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయింది.

– వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, చిత్తూరు

### విద్యారంగానికి అతితక్కువ



బడ్జెట్లో విద్యారంగానికి 9.8 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి 30 శాతం నిధులను కేటాయించాలన్న కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. ఉద్యోగులకు ఆర్థిక బకాయిల గురించి, 12వ పీఆర్సీకి సంబంధించిన అంశాలు ప్రస్తావించకపోవడం తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది.

– మునిరత్నం, యూటీఎఫ్, రాష్ట్ర కౌన్సిలర్, నగరి

### రైతుల పట్ల చిన్నచూపే..



రైతుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూడడం అన్యాయం. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయంలో మెలిక పెట్టడం సరికాదు. రైతుల పట్ల పాలకుల తీరు సరికాదు. వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులు అన్నీ తూతూమంత్రంగానే ఉన్నాయి. రాయితీ విత్తనాలకు, భూసార పరీక్షలకు, ఎరువులకు పెట్టుబడి లేక రైతులు అవస్థలు పడుతున్నారు.

– భానుమూర్తి, రైతు, గుడిపాల

### పోలవరం పూర్తిపై స్పష్టత ఏదీ ?



పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల గోడు కూటమి ప్రభుత్వానికి కనిపించలేదా?. ఎప్పటిలోగా ప్రాజెక్టును పూర్తి చేస్తారన్నది స్పష్టంగా చెప్పలేదు. పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలంగా రాష్ట్రాన్ని మారుస్తామన్నారు. కానీ సంపద సృష్టించే కార్మికుల సంక్షేమంపై బడ్జెట్‌లో ఊసేలేదు. విద్యుత్ చార్జీల తగ్గింపుపై బడ్జెట్‌లో ప్రస్తావనే చేయకపోవడం అన్యాయం.

– సురేంద్ర, సీపీఎం జిల్లా నాయకులు

# ఉపాధిలో కోర్టు ధిక్కరణ

- ఇటీవల పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు
- న్యాయస్థానంలో బాధితులకు ఊరట
- కోర్టు ఆర్డర్లను పక్కన పెట్టాలని నేతల ఒత్తిడి
- పనులకు వెళ్లొద్దని కూలీలకు బెదిరింపులు



ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉపాధి హామీ పథకంలో టీడీపీ పెత్తనం జోరందుకుంది. నేతలు పనుల్లో జోక్యం చేసుకుని కూలీల కడుపు కొడుతున్నారు. లోకల్ నాయకుల కక్షలు, కుతంత్రాలకు కూలీలు బలవుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగాలకు సైతం ఎసరు పెడుతున్నారు. ఇటీవల దౌర్జన్యంగా తొలగిస్తే, ఆపై కోర్టులో న్యాయం బాధితులను వరించింది. అయితే కోర్టు ఆర్డర్ వచ్చి నెలలు గడుస్తున్నా నేతల ఒత్తిడితో అధికారులు ఆ ఉత్తర్వులను అమలు చేయడం లేదు.

చిత్తూరు మండలంలో 17 పంచాయతీలున్నాయి. ప్రతి పంచాయతీలోను ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లను దౌర్జన్యంగా తొలగించారు. తొప్పాతిపల్లి, పెరుమాళ్లకండ్రిగ, పెద్దిశెట్టిపల్లి, తాళంబేడు, పాలూరు, అనంతాపురం, నాయనిచెరువు, గువ్వకల్లు పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లను అడ్డగోలుగా పక్కన పెట్టారు. వారి గోడును వెల్లబోసుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు రాష్ట్ర న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బాధితులకు న్యాయం వరించింది. దీంతో అధికారులకు కోర్టు ఆర్డర్లు అందడంతో తొలుత పెరుమాళ్లకండ్రిగ, నాయనిచెరువు, పెద్దిశెట్టిపల్లి, తొప్పాతి, పాలూరు ఫీల్డ్ అసిస్టెంట్లను మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. ఆ తరువాత వచ్చిన కోర్టు ఆర్డరు విషయంలో జాప్యం చేస్తున్నారు. ఈ న్యాయస్థానం ఆదేశాలను అనుసరించి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డ్వామా పీడీ, ఎంపీడీఓలు మండల సిబ్బంది ఆదేశాలిచ్చారు. అయితే నెలలు గడుస్తున్నా వారిని విధుల్లోకి తీసుకోవడం లేదు. ఎంపీడీఓ సెలవుపై వెళ్లారని, అందుకే విధుల్లోకి తీసుకోవడం లేదని మండల సిబ్బంది సాకు చూపిస్తున్నారు. స్థానికంగా ఉన్న కొందరు టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోర్టు ఆర్డరు ధిక్కరణపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

#### ఆర్డర్లు తెచ్చుకున్న వారిపై కక్ష

ఆర్డర్లు తెచ్చుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై స్థానిక టీడీపీ నాయకులు కక్ష కట్టారు. తప్పుడు కేసులు పెట్టాలని యోచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వారి కుటుంబీకులను రోడ్డుపైకి లాగాలని చూస్తున్నారు. ఆర్డర్లతో వచ్చినా ఫీల్డ్ అసిస్టెంట్ల వద్దకు పనికి వెళ్లొద్దని భయపెడుతున్నారు. పింఛన్లు పీకేస్తామని బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలు రాకుండా చూస్తామని బెదిరింపులకు దిగుతున్నారు.

#### అధికారులకే తికమక..

మండలంలోని కొన్ని పంచాయతీలకు ఇద్దరు చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఇందులో ఒకరు కోర్టు ఆర్డర్ తెచ్చుకుని పనిచేస్తుంటే..మరొకరు మాత్రం నాయకుల సిఫార్సుతో పని చేస్తున్నారు. కోర్టు ఆర్డర్ ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యాలయానికే పరిమితమవుతున్నారు. సిఫార్సుతో వచ్చిన వాళ్లు క్షేత్రస్థాయిలో పనులు చేయిస్తున్నారు. అధికారులు కూడా ఎవరి చేతి పని చేయించాలో తెలియక తికమకపడుతున్నారు. కాగా కోర్టు ఆర్డర్ ధిక్కరణపై ఇప్పుడు ఉన్నతాధికారులు ఏ రకమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

#### కడుపు కోతలు

క్షేత్రస్థాయిలో టీడీపీ నేతలు చేస్తున్న స్వార్థ రాజకీయాలతో కూలీలకు కడుపు కోతలు మాత్రమే మిగులుతున్నాయి. ఈ తర్జనభర్జన వల్ల పనులు ఆగిపోయాయి. కూలీలకు వంద రోజుల పని కల్పించడం లేదు. పనుల కోసం అల్లాడుతున్నారు. కూలి పనుల కోసం చిత్తూరు నగరాన్ని ఆశ్రయిస్తున్నారు. మూడు నెలలుగా మండలంలో ఇదే దుస్థితి ఎదరవుతోంది. ఉపాధి పనుల లక్ష్యం మూలన పడింది. పనిదినాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టింది.

#### ఎంపీడీఓ వస్తే...

కోర్టు ఆర్డర్ వచ్చింది. ఎంపీడీఓ సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు. ఆయన సంతకం తీసుకోవాలి. ఆయన ఏం చెబుతారో దాన్ని బట్టి ముందుకు వెళుతాం. ఆపై ఏం జరుగుతుందో తెలియదు.

– చిన్న రెడ్డెమ్మ, ఏపీఓ, చిత్తూరు

## వచ్చే నెల సీఎం కుప్పం పర్యటన



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

కుప్పం: వచ్చే నెల డిసెంబర్ మొదటివారం ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనకు వస్తున్నారని, ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు సిద్ధంగా ఉండాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. సోమవారం కడా కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించాలని సూచించారు. సీఎం పర్యటనలో ప్రజలు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తే మళ్లీ అధికారులే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ ప్రాధాన్యత ఇచ్చి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమస్యల పరిష్కారంపై సమీక్షించారు.

# కృష్ణా జలాలు కుప్పానికి చేరేనా?



పెద్దపంజాణి : చుక్కనీరు లేకుండా ఎండిన కుప్పం బ్రాంచ్ కెనాల్



గంగవరం: పశుపత్తూరు వద్ద నిర్మించిన లిఫ్ట్ వద్ద గడ్డి మొలిచిన దృశ్యం

- గత ప్రభుత్వం కాలువ విస్తరణకు రూ.1,217 కోట్ల కేటాయింపు
- కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం రూ.867 కోట్లే
- ఈ నిధులు కాలువ విస్తరణకా..! లేక లైనింగ్‌కే పరిమితమా ?
- ఈ ప్రాంతానికి కృష్ణా జలాల కోసం రైతన్నల ఎదురు చూపులు

పలమనేరు: కుప్పానికి కృష్ణమ్మ జలాలు రావాలన్నది ఈ ప్రాంతవాసుల కల. కుప్పానికి ప్రాతినిధ్యం వహిస్తూ గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబు ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా ఆయనే ఉన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కుప్పానికి సాగునీరు అందిస్తామని పలు దఫాలు చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019 ఎన్నికలప్పుడు పుంగనూరు ఉపకాలువ నుంచి కుప్పం ఉపకాలువకు నీరు పారించారు. ఇవి కనీసం నదిలో ప్రవహించి, కొన్ని రోజుల్లోనే ఇంకిపోయాయి. ఆపై అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుప్పానికి నీరందాలనే దృఢసంకల్పంతో పనులు చేపట్టి గతేడాది కుప్పానికి నీరందించడమే కాకుండా మూడు చెరువులకు సైతం కృష్ణా జలాలతో నింపారు. మరింత ఎక్కువగా కాలువలో నీటి ప్రవాహం కోసం రూ.1,217 కోట్లను కాలువ విస్తరణ పనులకు కేటాయించారు. ఆపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పనులకు మంగళం పాడింది.

#### హంద్రీనీవా పనులకు రూ.867.75 కోట్లు

ఈ బడ్జెట్‌లో హంద్రీనీవా కాలువ పనులకు రూ.867.75 కోట్లను కూటమి పాలకులు కేటాయించారు. దీంతో పుంగనూరు, కుప్పం కాలువల విస్తరణకు ఈ నిధులు చాలవనే మాట ఆ శాఖకే చెందిన కొందరు రిటైర్డు అధికారులు చెబుతున్నారు. అయితే కాలువకు లైనింగ్ లాంటి పనులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదేమైనా ఈ ప్రభుత్వంలోనైనా పలమనేరు, కుప్పం ప్రాంతాలకు కృష్ణమ్మ వస్తే చాలని ఇక్కడి రైతులు వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు.

## రాష్ట్రస్థాయి అవార్డుల స్వీకరణ



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లెక్చరర్ శ్రీదేవి



ఉర్దూ అకాడమీ ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహమ్మద్ అలీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉత్తమ సేవలకు గాను జిల్లాకు చెందిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. సోమవారం రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా జిల్లాలోని కృష్ణవేణి ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ శ్రీదేవి అవార్డును స్వీకరించారు. అలాగే ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో వి.కోటకు చెందిన గణిత ఉర్దూ ఉపాధ్యాయుడు మహమ్మద్ అలీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పలువురు వారిని అభినందించారు.

## శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 82,233 మంది స్వామివారిని దర్శించుకోగా 26,415 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## క్లుప్తంగా

### చైన్ కాజేసి.. తిరిగిచ్చేసి..

**పూతలపట్టు:** బంగారు నగలను దొంగతనం చేసిన ఓ దొంగ తిరిగి ఇచ్చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 3వ తేదీ మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో భారతి అనే మహిళ ఇంటి వద్ద పనులు చేస్తుండగా ఇద్దరు యువకులు మాస్క్ ధరించి బైక్‌లో వచ్చి మహిళ మెడపై కత్తి పెట్టి ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఆమె మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా స్పందన లేదు. అయితే సోమవారం ఉదయం ఇంటి ముందు నలుపు రంగు కవర్ ఉండడం గమనించిన భారతి దాన్ని తెరిచిచూడగా తన 25 గ్రాముల బంగారం అందులో ఉండడం చూసి ఆశ్చర్యపోయింది. దొంగే దొంగలించిన నగలు ఇచ్చేశాడు. దీనిపై గ్రామస్తులు దొంగ చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన వాడేనని భావిస్తున్నారు.

### పీజీఆర్ఎస్‌పై విచారణ చేపట్టండి

**చిత్తూరు అర్బన్:** పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. సోమవారం ఆయన చిత్తూరులోని పోలీసు ఆర్మ్డు రిజర్వు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్‌కు 37 ఫిర్యాదులు రాగా.. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలు, మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు.

# ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 131 అర్జీలు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

| అర్జీల వివరాలు | |
|---|---|
| రెవెన్యూ శాఖ | 104 |
| పోలీస్ శాఖ | 03 |
| మిగిలిన శాఖలు | 128 |
| మొత్తం అర్జీలు | 131 |

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు ఉన్నతాధికారులకు అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు న్యాయం చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ శాఖలకు సంబంధించి 131 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### మా సమస్యలు పరిష్కరించండి

జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యతగా భావించాలన్నారు. 104 వాహన సర్వీసులను గతంలో లాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు గిరి, జ్యోతి, సుమన్, జ్యోతీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### వర్కర్లను వేధించే అధికారి మాకొద్దు


ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వర్కర్లను వేధించే అధికారి తమకు వద్దని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్, సీఐటీయూ నాయకులు ఐసీడీఎస్ పీడీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు వాడ గంగరాజు, షకీల మాట్లాడుతూ గతంలో కుప్పం ప్రాజెక్టులో వర్కర్లను మానసికంగా వేధించిన సీడీపీఓ అరుణశ్రీ బైరెడ్డిపల్లి ప్రాజెక్టుకు రావడం తమకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. గతంలో అనేక రకాలుగా కోరినప్పటికీ ఆమెలో మార్పు రాలేదని చెప్పారు. అవినీతిని ప్రోత్సహిస్తూ కొంతమందిని తాను చెప్పినట్లు మార్చుకుంటుందని ఆరోపించారు. ఆమెను మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దాసరి చంద్ర, రమాదేవి, దామోదరం, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు శ్యామల విజయలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### రహదారిని ఆక్రమించుకున్నారు


సమస్యను వివరిస్తున్న గాంధీపురం గ్రామస్తులు

ప్రభుత్వ రహదారిని కొందరు ఆక్రమించుకున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని యాదమరి మండలం కాశిరాళ్ల పంచాయతీ గాంధీపురం గ్రామస్తులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. గ్రామస్తులు సురేష్, చరణ్ మాట్లాడుతూ గాంధీపురం గ్రామానికి వెళ్లే ప్రభుత్వ రహదారిని కొందరు ఆక్రమించుకోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బకాసురుల పేర్లు రాయలేదే..?

- విజయానందరెడ్డి ఫైర్


మాట్లాడుతున్న విజయానందరెడ్డి

**చిత్తూరు కార్పొరేషన్:** గత టీడీపీ పాలనలో మార్కెట్ గేటు దక్కించుకుని చిన్నా, చితక వ్యాపారుల రక్తాన్ని పీల్చుకుని డబ్బులు వసూలు చేసుకుని, కార్పొరేషన్‌కు బకాయిలు పడిన బకాసురుల పేర్లు ఎందుకు రాయలేదని ఓ 'పచ్చ' పత్రికను వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈసారి మార్కెట్ గేటు చెల్లించకపోవడం నిజంగానే ఎన్నికల స్టంటైతే నాలుగేళ్ల పాటు గేటు ఎందుకు కడతామన్నారు. చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం ఓ 'పచ్చ' పత్రికలో చిత్తూరులో గేటు ఫ్రీ ఎన్నికల స్టంటేనా..? అని ప్రచురించిన తప్పుడు కథనంపై ఆయన మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు నాలుగేళ్లపాటు కార్పొరేషన్‌కు రూ.కోట్లు చెల్లించి, ప్రజల నుంచి రూపాయి వసూలు చేయలేదనే విషయం గుర్తుచేశారు. దీన్ని టీడీపీ అనుకూల పత్రిక తప్పుడు కథనం వండి వార్చిందన్నారు. ఇంతకుముందు గేటు దక్కించుకుని కార్పొరేషన్‌కు డబ్బులు కట్టకుండా ఉన్న టీడీపీ నాయకుల పేర్లను ఆ పత్రికలో రాసే దమ్ముందా ? అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేస్తామంటున్న కూటమి నాయకులు గేటు డబ్బులు చెల్లించి, ప్రజల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయకుండా సహృదయం చాటుకోవాలని సూచించారు.

# కూటమి ప్రభుత్వం విఫలం


తవణంపల్లె తహసీల్దార్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

**తవణంపల్లె:** ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు బ్యాంకు ఖాతాలోకి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి, రబీ సీజన్ వచ్చినా రైతులకు సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం నాయకులు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు సోమవారం తవణంపల్లె రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు రూ. 20 వేలు సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, చెరువులను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మునిరత్నం నాయుడు, రాజేంద్రన్, బాలకృష్ణనాయుడు, గుణశేఖర్, బాలరాజు, రవి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిది మంది ఎర్ర కూలీలు అరెస్ట్


ఎర్రచందనం కూలీలను అరెస్ట్ చూపుతున్న పలమనేరు పోలీసులు

- పట్టుబడిన వారిలో ఇద్దరు మైనర్ బాలురు
- మరో ఇద్దరు కీలక వ్యక్తులు పరార్
- 12 దుంగలు, ఇన్నోవా కారు సీజ్
- నిందితులంతా తిరువణ్ణామలై జిల్లా జమునమత్తూరు తాలుకా పరిధికి చెందిన వారు

**పలమనేరు:** శేషాచలం అడవుల నుంచి ఖరీదైన కార్లలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించే ముఠాను పలమనేరు పోలీసులు పట్టుకుని సోమవారం అరెస్ట్ చూపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ నరసింహరాజు మీడియాకు వెల్లడించారు. స్థానిక పోలీసులు మండలంలోని కాలువపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఓ ఇన్నోవా కారులో నుంచి కొందరు యువకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ఎనిమిదిమందిని పట్టుకున్నారు. మరో ఇద్దరు కీలక వ్యక్తులు పరారయ్యారు. కారులో 12 ఎర్రచందనం దుంగలు కనిపించగా, వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కారు, ఎర్రచందనం దుంగలను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన వారంతా తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలై జిల్లా జమునమత్తూరు తాలుకా పరిధిలో ఉన్న పలు గ్రామాలకు చెందిన శరవణన్, బాబు, మత్తివన్నన్, విజయకుమార్, హరీష్, శక్తివేలుతో పాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నారు. పరారైన ఏ1 నిందితుడు వినోద్‌కుమార్, ఏ2 సేటులపై కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కాగా వీరు గత నెల 21న కూడా కారులో ఎర్రచందనం దుంగలను పలమనేరు మీదుగా స్మగ్లింగ్ చేసినట్టు విచారణలో తెలిసిందన్నారు. అనంతరం నిందితుల అరెస్టు చూపి, అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఎస్ఐ స్వర్ణతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

# రికార్డులను పక్కాగా నిర్వహించండి

- అపార్ గుర్తింపు కార్డుల జారీకి నోటరీ, అఫిడవిట్ అవసరం లేదు
- వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో పంచాయతీ నిధులను పారదర్శకంగా సద్వినియోగం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ నిధులను పారదర్శకంగా సద్వినియోగం చేయాలని, నిధుల వినియోగానికి సంబంధించి రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులను నిర్దేశించిన గడువు లోపు శుభ్రం చేసి క్లోరినేషన్ చేస్తే కలరా, డయేరియా, హెపటైటిస్, టైఫాయిడ్ వంటి వ్యాధులకు కారణమైన బాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు.

**నోటరీ, అఫిడవిట్‌లు అవసరం లేదు**

విద్యార్థులకు అపార్ గుర్తింపు కార్డుల జారీకి నోటరీ, అఫిడవిట్ అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. పంచాయతీ సెక్రటరీలు తమ పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఆధార్ అప్డేషన్, కరెక్షన్స్‌కు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 65.35 శాతం అపార్ ఐడీలు పూర్తి అయినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు అపార్ కార్డ్ మంజూరుకు విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

**14 నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు**

జిల్లావ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 18 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

**ల్యాప్‌టాప్‌ల అందజేత**

జిల్లాలోని రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ రూపొందించిన అవగాహన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు మూడు ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ మోహన్‌కుమార్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూధన్‌లు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి కృషి


విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తామని చుడా చైర్మన్ కఠారి హేమలత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నాగయ్యకళాక్షేత్రంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివంగత మాజీ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, మండలంలో షాదీఖానాలను నిర్మించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూ స్కూళ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతామన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీ సంక్షేమ శాఖలు, వక్ఫ్ బోర్డు, ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో అందుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరుస్తున్నట్లు తెలిపారు. అనంతరం జీజేఎం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవనాయుడు, నాయకులు సురేంద్ర కుమార్, ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# దుకాణాలపై అధికారుల కొరడా


చికెన్ దుకాణం వేయింగ్‌మెషీన్‌ను పరిశీలిస్తున్న పలమనేరు లీగల్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి


బియ్యం దుకాణాలపై తనిఖీ చేస్తున్న చిత్తూరు లీగల్ ఇన్‌స్పెక్టర్ దివ్య

- చిత్తూరులో తూ.కొ.శాఖ అధికారుల దాడులు
- 30 కేసులు నమోదు

**చిత్తూరు కార్పొరేషన్:** నగరంలోని పలు దుకాణలపై తూనికల కొలతల శాఖ డీసీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు చేశారు. చిత్తూరు, తిరుపతి, పలమనేరు లీగల్ ఇన్‌స్పెక్టర్లు దివ్య, మల్లేశ్వర్, రమాదేవి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దుకాణలను తనిఖీలు చేశారు. ఇందులో పలువురు వ్యాపారులు నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. బియ్యం హోల్‌సేల్ దుకాణాల్లో 26 కేజీల బస్తా బరువు కేజీ తక్కువగా ఉన్నట్లు గుర్తించి 8 కేసులు పెట్టారు. ఎలక్ట్రికల్ తూకం మెషీన్‌ను రెన్యువల్ చేసుకోకుండా కేజీకి వంద గ్రాములు తక్కువ అమ్ముతున్న 4 చికెన్ సెంటర్లు, 5 చేపల దుకాణాలు, ప్యాకింగ్ వివరాలు లేని ఆయిల్‌షాప్‌పై 1, వస్తువుల అమ్మకాలపై డిక్లరేషన్ లేని కిరాణా, ఫ్యాన్సీ స్టోర్లపై 7, హార్డ్‌వేర్ దుకాణాలపై 3, ఎలక్ట్రికల్ దుకాణలపై 2 కలిపి మొత్తం 30 కేసులు బుక్ చేశామని అధికారులు వెల్లడించారు. వ్యాపారులు మోసాలకు పాల్పడినట్లు తెలిస్తే వినియోగదారులు చిత్తూరు లీగల్ ఇన్‌స్పెక్టర్‌కు 9398158259 నంబరు ద్వారా తెలియజేయవచ్చని అధికారులు తెలిపారు.

# ముగిసిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు


గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

**యాదమరి(పూతలపట్టు):** యాదమరి మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో సోమవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో అండర్-17 బాలురులో మొదటి స్థానం శ్రీకాకుళం, రెండవ స్థానం చిత్తూరు, మూడవ స్థానం నెల్లూరు నిలిచాయి. బాలికలలో మొదటి స్థానం విశాఖపట్నం, రెండవ స్థానం చిత్తూరు, మూడవ స్థానం తూర్పు గోదావరి క్రీడాకారులు నిలిచారు. గెలుపొందిన వారికి బంగారు మెడల్‌తో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ 2వ తేదీన ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి వసంతవాణి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రుక్మిణి, కార్య నిర్వాహకులు రవి, పీడీలు కృష్ణయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.